ప్రజాశక్తి

మంగళవారం 26 డిసెంబర్ 2023

రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీల్లో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని బర్నికుల కీర్తిక మంచి ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి వ్యాసరచన పోటీలకు ఎంపికైంది. ప్రతిభ చూపిన విద్యార్థినికి రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి కె.వెంకటనాగేశ్వరావు, కమిషనర్ అరుణ్‌కుమార్, వినియోగదారుల జిల్లా అధ్యక్షులు పట్నాయకుని నాగమణి, హెచ్‌ఎం బిడ్డిక భీముడు అభినందించారు.

మున్సిపల్ కార్మికుల సమ్మెట

- సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం
- నేటి నుంచి నిలిచిపోనున్న పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - సాలూరు

మురికిలో మురికై, కంపునే ఇంపుగా చేసుకుని ప్రజల ఆరోగ్య పరిరక్షణకు పని చేస్తున్న మున్సిపల్ కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికులు సమ్మెకు సిద్ధమయ్యారు. గడచిన నాలుగున్నరేళ్లలో తాము ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించడానికి కృషి చేయని రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా ఈనెల 26 నుంచి విధులకు దూరంగా ఉండబోతున్నారు. పాలకుల దృష్టిని ఆకర్షించడానికి దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టి చివరికి సమ్మెబాట పట్టిన కార్మికుల బతుకులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. సరిగ్గా నాలుగున్నర ఏళ్ల క్రితం ప్రతిపక్ష నేతగా ఇప్పుడున్న సిఎం జగన్ మోహన్ రెడ్డి ప్రజాసంకల్పయాత్రలో భాగంగా పట్టణానికి వచ్చారు. మున్సిపల్ మహిళా పారిశుధ్య కార్మికుల చేతిలో చెయ్యేసి సాగించిన పాదయాత్ర తమ జీవితాల్లో వెలుగులు నింపుతుందని రాష్ట్రంలోని వేలాదిమంది కార్మికులు భావించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పకుండా మడమ తిప్పకుండా హామీలను నెరవేర్చుతారని గడిచిన నాలుగున్నర ఏళ్ల పాటు వేచి చూశారు. అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లో కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేస్తానని చెప్పిన మాట నేటికీ నీటిమూటగా మిగిలి పోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో సమ్మెకు సిద్ధమయ్యారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల్లోనూ, నగరపంచాయతీల్లో ఎన్నికల హామీలను అమలు చేయాలని కోరుతూ దశలవారీగా పోరాటాలు నిర్వహించారు. ఈ ఏడాది గతంలో పనిచేసిన మున్సిపల్ శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రస్తుత మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలం సురేష్, మున్సిపల్ పరిపాలన శాఖ ముఖ్యకార్యదర్శి వై.శ్రీలక్ష్మి, డిఎంఎ కోటేశ్వరరావుతో ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు దఫదఫాలుగా జరిపిన చర్చలు విఫలమయ్యాయి. ఇటీవల ఈనెల 14న చర్చలు జరిగిన హామీల అమలు పట్ల నిర్లిప్తత కొరవడింది. 2022 జులైలో జరిగిన ఐదురోజుల సమ్మె సందర్భంగా ఇంజినీరింగ్ కార్మికులకు ప్రతిపాదించిన జీతాలు చెల్లించలేదు. ప్రజారోగ్యశాఖలో చెత్తలను తరలించే వాహన డ్రైవర్లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీలో పని చేస్తున్న కార్మికులకు గత మూడేళ్లుగా హెల్త్ అలవెన్సులు చెల్లించడం లేదు. ఆప్కాస్‌లో మున్సిపల్ కార్మికులను విలీనం చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణిస్తూ సంక్షేమ పథకాలకు కోత విధించారు. కానీ ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే జీతభత్యాలు, కరువు భత్యం, సరెండర్ లీవులు, గ్రాట్యుటీ, పెన్షన్ వంటి సౌకర్యాలేవీ అమలు చేయడం లేదు.

పట్టణంలో రోడ్డును శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు (ఫైల్)

పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు

గడిచిన నాలుగున్నరేళ్లలో పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలతో పోలిస్తే మున్సిపల్ కార్మికుల జీతాలు గొర్రెతోక బెత్తెడులాగే మిగిలాయి. నిత్యావసర సరుకులు, కూరగాయలు, మాంసం, చేపలు, వంటనూనె, గ్యాస్ పెట్రోల్ డీజిల్ ధరలు 200శాతం నుంచి 300శాతం పెరిగాయి. కానీ కార్మికుల జీతం 12,000 నుంచి 15000 రూపాయలకు మాత్రమే పెరిగింది. అంటే 25 శాతం మాత్రమే జీతాలు పెరిగాయి. ధరలు ఆకాశాన్ని తాకిన విధంగా పెరిగితే కార్మికుల జీతాలు పాతాళంలోనే వుండిపోయాయి. నిత్యం పట్టణ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో కీలకపాత్ర పోషిస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యల్ని పరిష్కరించడంలో ప్రభుత్వం మొండిగా వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పారిశుధ్య నిర్వహణపై సమ్మెట దెబ్బ

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపాల్టీలు, నగరపంచాయతీల్లో కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికులు 26నుంచి సమ్మెకు దిగుతుండడంతో పారిశుధ్య నిర్వహణపై తీవ్ర ప్రభావం చూపనుంది. పండగల సమయంలో కార్మికులు సమ్మెకు వెళ్లడం వల్ల పారిశుధ్య పనులు స్తంభించిపోయే అవకాశం ఉంది. కార్మికులతో పాటు క్లాప్ ఆటోల డ్రైవర్లు, సిపిఎస్ ఉద్యోగులు సమ్మెలో పాల్గొంటారు. సాలూరు

డిమాండ్లు ఇవే

- కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలి
- సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి
- రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ సౌకర్యం కల్పించాలి
- ఇంజనీరింగ్ కార్మికులకు హెల్త్, రిస్క్ అలవెన్సులు చెల్లించాలి
- క్లాప్ ఆటో డ్రైవర్లకు కనీస వేతనం రూ.18,500 చేయాలి
- ఆప్కాస్‌లో ఉన్న మున్సిపల్ ఉద్యోగులకు, కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ సౌకర్యం కల్పించాలి
- పర్మినెంట్ ఉద్యోగులకు సిపిఎస్ రద్దు చేయాలి
- విలీన పంచాయతీలు, కరోనా, వరదలు వంటి విపత్తుల సమయంలో తీసుకునే కార్మికులకు ఆప్కాస్ జీతాలు, అలవెన్సులు చెల్లించాలి.

మున్సిపాలిటీలో 140 మంది, పార్వతీపురంలో 150 మంది, పాలకొండ నగరపంచాయితీలో వంద మంది కార్మికులు సమ్మెలో పాల్గొననున్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే సమ్మె

రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్యం వల్లనే మున్సిపల్ కార్మికులు అనివార్యంగా సమ్మెలోకి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. గడచిన మూడు నెలలుగా కార్మికుల సమస్యల్ని పరిష్కరించడంలో గానీ, చర్చలు జరపడంలో గానీ ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించింది. గతంలో ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలనే అమలు చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. కొత్తగా కోరిన కోరికలు ఏమీ లేవు. కార్మికుల సమ్మెకు ప్రజలు మద్దతు తెలపాలి.

ఎన్‌వై నాయుడు,
ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి

సామాన్యుడికి ధరాఘాతం

- ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాల ధరలు
- దిగిరాని కూరగాయల ధరలు
- బెంబేలెత్తుతున్న ప్రజలు

ప్రజాశక్తి - కురుపాం

రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర ధరలకు రానున్న పండగలను లను సామాన్య ప్రజానీకం సంతోషంగా జరుపుకోలేని పరిస్థితి కన్పిస్తోంది. నిత్యావసర వస్తువులతో పాటు అన్నిరకాల ధరల పెరుగుద సామాన్య ప్రజానీకాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. సామాన్యులు ఎక్కువగా జరుపుకునే పండుగ క్రిస్మస్, సంక్రాంతి. ప్రతి ఒక్కరూ తమ బంధువులను పండుగకు ఇంటికి పిలుచుకుని ఆనందంగా గడుపుతారు. పిండివంటలు చేసుకోవడంతో పాటు కొత్త బట్టలు పెద్దఎత్తున కొనుగోలు చేస్తారు. అయితే అందనంత ఎత్తుకు అన్నిరకాల ధరలు పెరిగిపోవడంతో సామాన్య ప్రజానీకం ఇళ్లలో పండుగ సందడి కానరావడం లేదు. బహిరంగ మార్కెట్లో కిలో కందిపప్పు రూ.180 పలుకుతుండగా, పెసరపప్పు రూ.125, వంటనూనె రూ.120కుపైగా, బెల్లం కిలో రూ.50, మినపప్పు రూ.120 ఇలా అన్ని రకాల ధరలు ఆకాశంలో ఉన్నాయి. మోడీ సర్కార్ వచ్చిన తర్వాత రూ.430 ఉండే గ్యాస్ సిలిండర్ కాస్త ప్రస్తుతం రూ.980కు చేరింది. ఏదైనా పిండివంట చేయాలంటే తక్కువగా లెక్కించినా రూ. ఐదు వేలు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఉంది. దీంతో పిండి వంట చేసేందుకు సామాన్య ప్రజానీకం భయపడుతున్నారు. ఇక బట్టల విషయానికొస్తే గతంలో రూ.500 పలికే బట్టలు ఇప్పుడు రూ. వెయ్యికి చేరాయి. చిన్న పిల్లల దుస్తులైతే మరింత ధర పలుకుతున్నాయి. దీంతో సంతోషంగా జరుపుకోవాల్సిన పండుగ వేళ సామాన్య కుటుంబాలు నిరాశ. నిస్పృహల నడుమ కొట్టుమిట్టాడుతున్నాయి. కుటుంబమంతా బట్టలు కొనుగోలు చేసుకోకుండా పిల్లల వరకూ కొనుగోలు చేసి చాలా కుటుంబాలు సర్దుకున్న పరిస్థితి కన్పిస్తోంది. ధరల పెరుగుదలతో పిండివంటలు చేసుకునే అవకాశం లేకపోవడంతో రెడీమేడ్‌గా తయారుచేసిన పిండివంటలను ఏదో కొద్దిగా కొనుగోలు చేసి గడిపేస్తున్నారు. బంధువులను సైతం పండుగకు పిలవడం మానేశారు. కుటుంబమంతా బట్టలు కొనుగోలు చేసుకుని, పిండి వంటలు వండుకుని సంతోషంగా జరుపుకోవాలంటే ప్రస్తుత ధరలతో కనీసంగా రూ. 20వేలుపైనే ఖర్చవుతోంది. అంత ఖర్చు చేసే పరిస్థితిలో సామాన్య కుటుంబాలు లేవు.

ఇక కూరగాయల ధరలు సైతం విపరీతంగా పెరిగిపోయాయి. కిలో అల్లం రూ.130 పలుకుతుండగా, వెల్లుల్లి రూ.200, వంకాయలు కిలో రూ.64, క్యారెట్ కిలో రూ.60, కాకర కిలో రూ.60, చిక్కుడు కిలో రూ.120, బీన్స్ కిలో రూ.74, బీర రూ.60, ఇలా అన్ని రకాల కూరగాయల ధరలు సామాన్యునికి అందనంత ఎత్తుకు ఎగబాకాయి. నిత్యావసరాల ధరలతో పాటు అన్ని వస్తువుల ధరలు పెరగడానికి ప్రధాన కారణం పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరిగిపోవడమే. మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత లీటర్ పెట్రోల్ రూ.120, డీజిల్ రూ. వంద పలుకుతోంది. దీంతో రవాణా ఛార్జీలు విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో నిత్యావసర, కూరగాయల ధరలు సైతం అందనంత ఎత్తుకు చేరుకుంటున్నాయి.

తగ్గిన వేతనాలు.. పెరిగిన ధరలు

కరోనా తర్వాత ఉపాధి అవకాశాలు దెబ్బతిని సామాన్య కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. కుటుంబమంతా కష్టపడినా నెలకు రూ.10వేలు సంపాదించడం గగనంగా మారింది. ఇలాంటి కుటుంబాలు పెరిగిన ధరలతో రూ.వేలు ఖర్చు పెట్టి పండుగలను సంతోషంగా ఏవిధంగా జరుపుకుంటాయో ప్రభుత్వాలే చెపాల్సి ఉంది. సామాన్యులకు ఉచితంగా ఏదో ఇచ్చేస్తున్నట్లు గొప్పలు చెబుతున్న ప్రభుత్వాలు, ధరల రూపంలో పీల్చిపిప్పి చేస్తున్నాయి. దీంతో ఒకప్పుడు ఎంతో సంతోషంగా జరిగే పండుగలు నేడు వెలవెలబోతున్నాయి.

సంపాదన మొత్తం వస్తువులకే

రోజంతా కష్టపడితే రూ.700 రూపాయలు వస్తుంది. ఈ సొమ్ముతో మార్కెటికు వెళ్లి కూరగాయలు కొంటే ఈ సొమ్ము మూలకు కూడా రావడం లేదు. కష్టపడిందంతా తిండికే పెట్టాల్సి వస్తుంది. ఇంకా పిల్లల చదువు, బాగుగోలికి ఏం చేయాలో అర్థం కావడం లేదు.

కె. సరోజిని,
కురుపాం.



కూరగాయలు కొనలేకపోతున్నాం

కష్టపడి వచ్చిన సంపాదనతో కుటుంబానికి నెట్టుకు రావడానికి చాలా కష్టంగా ఉంది. దీంతో కుటుంబానికి సరిపడినంత కూరగాయలు కొనలేక కొద్దో గొప్ప కొని, ఉన్నదాంతో కుటుంబ సభ్యులమంతా సర్దుకుపోయి తినాల్సిన పరిస్థితి వస్తుంది.

ఎస్. మంగమ్మ, పి.లేవిడి.

నేటి నుంచి ఆడుదాం ఆంధ్ర

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం మంగళవారం ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం మంగళవారం ప్రారంభం కానుంది. జిల్లాకు 79,800 ఆటగాళ్ల రిజిస్ట్రేషన్ లక్ష్యం కాగా, 82.59 శాతంతో 65,905 మంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.

మున్సిపల్ వర్కర్లకు మద్దతుగా బైక్ ర్యాలీ

పాలకొండ : రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు మంగళవారం నుంచి చేపడుతున్న నిరవధిక సమ్మెకు పాలకొండ పట్టణంలో ప్రజలు మద్దతు ఇవ్వాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ పాలకొండ పట్టణ కమిటీ సిఐటియు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ జరిగింది. ఈ మేరకు సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు మీదుగా పట్టణంలో పలు వీధుల గుండా బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ పాదయాత్రలో, అసెంబ్లీ సాక్షిగా జగనన్న ఇచ్చిన హామీల్లో పర్మినెంట్ చేస్తామన్న హామీని అమలు చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన జీతం ఇవ్వాలని, ఇంజనీరింగ్ కార్మికులకు రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని, చనిపోయిన వారికి రూ.2లక్షల నష్టపరిహారం ఇవ్వాలని, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 26 నుండి జరగనున్న సమ్మెకు ప్రజలంతా మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ పాలకొండ నగర పంచాయతీ ప్రతినిధులు ఎన్ని హరిబాబు, సిహెచ్ సంజీవి, పడాల వేణు, సిహెచ్.సురేష్, టి.ఈశ్వర కుమార్, పి.సూరిబాబు, కె.రాజేష్, పి.రమేష్, బాబురావు, సిఐటియు మండల కార్యదర్శి రాము తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ పట్టణంలో బైకు ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

28న భవన నిర్మాణ కార్మికుల చలో కలెక్టరేట్

విజయనగరం: భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమం కోసం గతంలో ఉన్న పథకాలు కొనసాగించాలని , ప్రమాదం జరిగి వికలాంగులైతే 2లక్షలు, మరణిస్తే రూ.5లక్షలు ఇచ్చి ఆదుకోవాలని, ఇతర భవన నిర్మాణ వస్తువులు ధరలూ తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 28న రాష్ట్ర వ్యాప్తంగా చలో కలెక్టరేట్ నిర్వహిస్తున్నట్లు భవన నిర్మాణ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి బి.రమణ తెలిపారు. సోమవారం ప్రజా సంఘాల ఆఫీస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడు తూ కరోనా కాలంలో కూడా భవన నిర్మాణ కార్మికులకు రూ.10వేలు సహాయం చేస్తానని అకౌంట్లు ఓపెన్ చేసిన జగన్‌ఎటువంటి సహాయం చేయకుండా తీవ్ర మనస్థాపానికి గురి చేశారన్నారు.

ప్రభువా... ప్రభుత్వం మనసు మార్చు

సమ్మె శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్

సాలూరులో ఒంటికాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ప్రభువా.. హామీలిచ్చి మరిచిపోయిన మా ప్రభుత్వ అధినేత మనసు నువ్వే మార్చాలంటూ అంగన్వాడీలు క్రిస్మస్ సందర్భంగా ఏసుక్రీస్తు చిత్రపటానికి వినతి అందించారు. అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు నాయకులు మర్రాపు అలివేలు, సాలూరు గౌరీమణి, సెక్టార్ నాయకులు కె.రాజేశ్వరి, ఎం.గౌరి, సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకట రమణ, సిఐటియు నాయకులు బొత్స లక్ష్మి ఆధ్వర్యంలో 14వరోజు నిరవధిక సమ్మెలో భాగంగా స్థానిక కలెక్టరేట్ వద్ద క్రిస్మస్ సందర్భంగా మేరీమాత, బాలఏసుల విగ్రహాలకు ప్రార్ధనలు చేసి కేక్ కట్ చేశారు. అనంతరం స్వీట్స్, కేక్ ఒకరికొకరు తినిపించుకొని అందరికీ పంచారు. ప్రభుత్వం మా సమస్యలు పరిష్కారం చేయాలని హ్యాపీ, హ్యాపీ క్రిస్మస్, మేరి,మేరి క్రిస్మస్ అంటూ వినూత్న రీతిలో నినాదాలు ఇచ్చారు. ఈ సందర్భంగా యుటియఫ్ రాష్ట్ర నాయకులు ఎస్.మురళీమోహన్, జిల్లా అధ్యక్షులు టి.రమేష్, కవి, కళాకారులు పక్కి రవీంద్రనాథ్, కె.మురళి, పూడి వెంకటనాయుడు మద్దతు తెలిపారు. అనంతరం యుటియఫ్ తరుపున రూ.10వేలు అంగన్వాడీలకు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, సిఎం హామీ అమలు చేయాలనిచ అంతవరకూ సమ్మె కొనసాగుతుందని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.సూరిబాబు, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు, అంగన్‌వాడీ సెక్టార్ నాయకులు టి.రాజేశ్వరి, బి.నీలవేణి, పార్వతి, ధర్మావతి, లలిత, పలువురు అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

సిపిఎం సంఘీభావం

మక్కువ : మండల కేంద్రంలో అంగన్‌వాడీలు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెకు సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు సంఘీభావం ప్రకటించారు. అంగన్వాడీలు నిర్వహిస్తున్న సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీల పోరాటం పట్ల ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందన్నారు. అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించుకుంటే వారి పోరాటాలకు ముందుండి ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు ఈశ్వరరావు, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు లీలావతి, పద్మ, కుమారి, జ్యోతి, గౌరీశ్వరి మండలంలోని అన్ని అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సాలూరు : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు చేపట్టిన సమ్మె 14రోజుకు చేరింది. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన నిరసన శిబిరం వద్ద ఒంటికాలిపై నిలబడి నినాదాలు చేశారు. యూనియన్ ప్రాజెక్టు నాయకులు బి.రాధ, ఎ.నారాయణమ్మ, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు ఆధ్వర్యాన అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలని డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్లు ఆమోదించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్యామల, వరలక్ష్మి, తిరుపతమ్మ, పార్వతి, శశికళ పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని అంగన్వాడీల సమ్మె 14వరోజుకు చేరింది. క్రిస్మస్‌ను పురస్కరించుకొని జగనన్నకు మంచి బుద్ధని కలిగించి, అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కారం చేయాలని, క్రిస్మస్ కేకును కట్ చేసి, కన్నీటి ప్రార్ధనలు చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గంట జ్యోతి, పి.రామలక్ష్మి, సెక్టార్ లీడర్లు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల వినూత్న నిరసనలు

14వ రోజుకు చేరిన సమ్మె

పాలకొండ : స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టులో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె సోమవారం 14వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పాలకొండ డివిజన్ కేంద్రంలో క్రిస్మస్‌ను పురస్కరించుకొని జరిపిన సమ్మెలో జగనన్నకు ఏసుప్రభువు మంచి బుద్ధిని కలిగించి, అంగన్వాడీ సమస్యలు తక్షణమే పరిష్కారం చేయాలని క్రిస్మస్ కేకును కట్ చేసి కన్నీటి ప్రార్ధన చేశారు. కార్యక్రమంలో ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్ హిమప్రభ, పాలకొండ ప్రాజెక్ట్ కమిటీ ప్రతినిధులు ఆర్.భవాని, ఎస్.గంగమ్మ, ఎం.శ్యామల, శ్రీదేవి, విజయలక్ష్మి, ఆరుద్ర తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించేలా ఏసుక్రీస్తు జగన్ ఆలోచన విధానాన్ని మార్చాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ప్రార్థన చేశారు. సిఐటియు మద్దతుతో అంగన్వాడీలు చేస్తున్న సమ్మె 14వ రోజు సోమవారం కొనసాగింది. వీరి ఆందోళనకు తెలుగుదేశం అరుకు పార్లమెంట్ రైతు ఉపాధ్యక్షులు బత్తిలి శ్రీనివాసరావు, సిఐటియు భవన కార్మికుల సంఘం మండల నాయకులు యమక గౌర్నాయుడు మద్దతు తెలిపారు.

సీతంపేట : స్థానిక ఐటిడిఎ ఎదుట అంగన్‌వాడీలు తలపెట్టిన సమ్మె సోమవారానికి 14వ రోజుకు చేరుకుంది. అంగన్వాడీ సీనియర్ కార్యకర్త సతీకుమారి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఎం.కాంతారావు అంగన్వాడీ ప్రాజెక్టు కమిటీ కార్యదర్శి ఎ.దర్శిమి, ఎ.అంజలి,అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి సంఘీభావం

బలిజిపేట : స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల వద్ద అంగన్‌వాడీలు చేపడుతున్న నిరవధిక సమ్మెకు ప్రజాశక్తి శ్రీకాకుళం ఎడిషన్ మేనేజర్ పి.గణేష్ సంఘీభావం తెలిపారు. న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు ఆందోళనలు చేపడుతున్నారని, ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పలువురు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : క్రిస్మస్ సందర్భంగా గుమ్మలక్ష్మీపురంలో అంగన్వాడీ సమ్మె శిబిరం వద్ద కార్యకర్తలు, హెల్పర్లు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రామిక మహిళా సంఘం జిల్లా నాయకులు వి.ఇందిర మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని గత 13 రోజులుగా అంగన్వాడీలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరం అన్నారు. క్రిస్మస్ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి మనసు మారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు టి.సత్యవతి, వై.కస్తూరి, చెముడుగూడ ఎంపిటిసి మండంగి రమణ ఉన్నారు.

గరుగుబిల్లి : మండల కేంద్రంలో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శిబిరం వద్ద క్రిస్మస్ కేక్ కట్ చేసి ఏసు ప్రభువు జగన్ మనసు మార్చాలని నినాదాలు చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియూ జిల్లా కార్యదర్శి బి వి రమణ మాట్లాడుతూ అంగన్వాడీల సమ్మె పట్ల రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం సరైన విధానం కాదని, వారి న్యాయమైన సమస్యలు వెంటనే పరిష్కరం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ మండల నాయకులు ఎం.సావిత్రి, కృష్ణవేణి, హైమావతి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట : అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని అంగన్వాడీ ప్రాజెక్ట్ అధ్యక్షులు ప్రభావతి అన్నారు. అంగన్‌వాడీలు చేపడుతున్న ఆందోళనలో ఆమె మాట్లాడారు. అంగన్వాడీలు చేస్తున్న న్యాయమైన పోరాటానికి ప్రజలంతా మద్దతు తెలపాలని కోరారు

మక్కువలో మాట్లాడుతున్న రెడ్డి వేణు

బలిజిపేటలో అంగన్‌వాడీలను ఉద్దేశించి మాట్లాడుతున్న గణేష్

సీతంపేటలో కేక్ చేస్తున్న అంగన్‌వాడీలు

సీతానగరంలో ప్రార్ధనలు చేస్తున్న అంగన్‌వాడీలు

ఎమ్మెల్యే జోగారావుకు వినతి పత్రాన్నిస్తున్న యుటిఎఫ్ నాయకులు

బకాయిల కోసం ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఉద్యోగ, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.12 వేల కోట్లు బకాయిలు చెల్లించాలని స్థానిక ఎమ్మెల్యేలకు, మంత్రులకు వినతులు ఇవ్వాలని యుటిఎఫ్ పిలుపునిచ్చింది. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహనరావు, జిల్లా కార్యదర్శులు కె.మురళి, పి.వెంకటనాయుడు వినతి పత్రం అందజేశారు. సమస్యలను గూర్చి సిఎం జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అలాగే ఈ నెల 26న పార్వతపురంలో, 27న పాలకొండలో రూ.12వేల కోట్లు బకాయిలు కోసం యుటిఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కారక్రమాన్ని ఉపాధ్యాయులంతా జయప్రదం చేయాలని కోరారు.

భవిష్యత్తుకు గ్యారెంటీ బాండ్లను పంపిణీ చేస్తున్న జయకృష్ణ

ఏజెన్సీలో టిడిపి 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి- సీతంపేట

మండలంలోని బెనరాయి గ్రామంలో పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వమించారు. ఈ సందర్భంగా జయకృష్ణ మాట్లాడుతూ మినీ మేనిఫేస్టోలోని సూపర్ సిక్స్ అంశాలను ప్రతి ఒక్కరికీ వివరించారు. రాష్ట్ర పరిస్థితులను అధ్యయనం చేస్తున్న ఏకైక వ్యక్తి చంద్రబాబు నాయుడేనని అతన్ని కచ్చితంగా గెలిపించుకుని రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకోవా లన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు సవర తోట మొఖలింగం, మహాశక్తి ప్రచారకర్త తోయిక సంధ్యారాణి, నియోజకవర్గ ఐటిడిపి కోఆర్డినేటర్ ఇమరక పవన్, సవర సుగన్న, సవర సోములు, సవర తేజ తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- సీతంపేట

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈనెల 26 నుండి నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను విజయవంతం చేసేందుకు యువత ముందుకు రావాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి పిలుపునిచ్చారు. సోమవారం వండవ క్యాంపు కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు జగనన్న సర్కారు ఆడుదాం ఆంధ్రా' పేరుతో క్రీడా పోటీలను నిర్వహిస్తోందన్నారు. ఈనెల 26 నుండి వచ్చే ఏడాది ఫిబ్రవరి 10వ తేదీ వరకు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, యోగా, టెన్నీకాయట్, మారథాన్ తదితర పోటీలను యువతకు నిర్వహిస్తారన్నారు. గ్రామ, వార్డు సచిలయాల పరిధిలో జనవరి 9 వరకు, మండల స్థాయిలో జనవరి 10 నుండి 23 వరకు, జనవరి 24 నుండి 30 వరకు నియోజకవర్గ స్థాయిలో, జనవరి 31 నుండి ఫిబ్రవరి 5 వరకు జిల్లా స్థాయిలో, ఫిబ్రవరి 6 నుండి 10 వరకు రాష్ట్ర స్థాయిలో 47 రోజుల పాటు సుధీర్ఘంగా ఈ పోటీలను పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొండ గూటికి పండగొచ్చింది..

ప్రజాశక్తి - కురుపాం

కొండ గూటికి కంది కొత్తల పండగ సందడి వచ్చింది. గిరిజన సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే కందికొత్తల పండగ గిరిజనుల ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తోంది. గిరిజన ఆచార, సంప్రదాయాలను ప్రతిబింబిస్తుంది. మన్యం వాసుల్లో ఆనందాన్ని, ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని నింపుతుంది. కందికొత్తల పండగ మండలంలోని గిరిజన గ్రామాల్లో ఘనంగా నిర్వహిస్తున్నారు. గిరిజన దేవతలు గొడ్డళ్లమ్మ, సత్తరామ్మను ఆడవి నుంచి గ్రామానికి తీసుకొచ్చి యజ్ఞోడు పూజిస్తారు. గిరిజన గ్రామాల్లో పండిన పంటలు ముందుగా ఈ దేవతలకు బోనాలు పెట్టిన తర్వాతే వీరు భుజిస్తూ ఉంటారు. డప్పు వాయిద్యాలతో ఊరేగిస్తారు. ఐదు రోజుల తర్వాత తిరిగి అడవిలోకి తీసుకెళ్లి విడిచి పెడుతుంటారు. ఏటా సంక్రాంతి ముందుగా గిరిజన గ్రామాల్లో గిరిజనులు పెద్ద ఎత్తున ఈ కందికొత్తల ఉత్సవాలు నిర్వహిస్తుండటం ఆనవాయితీగా వస్తోంది.

సత్తరమ్మను ఊరేగిస్తున్న గ్రామస్తులు

రోడ్డుకు శంకుస్థాపన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియమ్మ వలస మండలం చినమేరంగి గ్రామం నుంచి పిప్పలభద్ర గ్రామానికి నూతన రహదారి నిర్మాణం కోసం కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో రహదారుల నిర్మాణానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే 4.5 కిలోమీటర్లు రహదారి నిర్మాణానికి రూ.2 కోట్ల మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో మన్యం జిల్లా వైసిపి అధ్యక్షులు శత్రు చర్ల పరీక్షిత్ రాజు, జెడ్పిటిసి శశికళ, సర్పంచులు, ఎంపిటిసిలు, ఇంజనీరింగ్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీవాణి

ఎమ్మెల్యేకు సుందర హరీష్ కృతజ్ఞతలు

ప్రజాశక్తి - భోగాపురం

వైసిపి మండల యువజన అధ్యక్షులుగా భోగాపురం గ్రామానికి చెందిన సుందర హరీష్‌ను ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఇటీవలి నియమించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుకు హరీష్ సోమవారం ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో ఇచ్చిన ఈ పదవికి న్యాయం చేస్తానని ఆయనకు హామీ ఇచ్చారు. యువకులతో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. నాయకులు పల్లంట్ల శ్రీనివాసరావు, కొయ్య బంగారాజు, సుందర వెంకన్న, రోహిత్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సత్కరిస్తున్న హరీష్

విశ్వకర్మ పథకాన్ని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన విశ్వ కర్మ యోజన పథకాన్ని బిసి, ఎస్‌సి, ఎస్‌టిలు సద్వినియోగం చేసుకోవాలని బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు గొలగాని రమేష్ కుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఆదిత్య పాఠశాలలో చేతి వృత్తులదార్లతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతి వృత్తులతో ఆర్ధికంగా మరింత ఎదగడానికి శిక్షణ కల్పించడంతో బాటు ఉపాధి పొందడానికి 5శాతం తక్కువ వడ్డీతో రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు కేంద్ర ప్రభుత్వం రుణాలను ఇస్తుందన్నారు. ఈ సమావేశంలో బిసి సంక్షేమ సంఘం జిల్లా వైస్ ప్రెసిడెంట్ గిడుతూరి రాము, కార్యదర్శి వి.సూరిబాబు, పాల్గొన్నారు.

నాటుబళ్లతో ఇసుక డంప్

- అక్కడ నుంచి ట్రాక్టర్లతో జంప్
- మాఫియాకు అడ్డాగా మడతోటరేవు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - మక్కువ

ఇసుక అక్రమ రవాణాదారులకు అడ్డాగా సువర్ణముఖీ నది తీరాలు మారాయి. వీరి అక్రమ రవాణాకు అడ్డూ అదుపు లేదు. చేతిలో ఏ విధమైన టోకెన్ లేకపోయినా ఆదివారాలు సెలవైనా వీరి రవాణాకు మాత్రం అడ్డులేదు. రైతులు నాటుబళ్లతో రహదారి వరకు ఇసుకను డంప్ చేయించి, అక్కడ నుంచి ట్రాక్టర్లు నింపుకొని జంప్ అవ్వడం వీరికి పరిపాటిగా మారిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారం ఆయా శాఖల అధికారులకు తెలిసినా అక్రమ ఇసుక దందాను చూసీ చూడనట్లు వ్యవహరించడం పలు విమర్శలకు దారితీస్తుంది. మండలంలోని వెంకట భైరీపురం పంచాయతీని ఆనుకొని ఉన్న సువర్ణముఖి మడతోటరేవు ఇసుక మాఫియాకు అనువుగా మారింది. మండలంలోని డి-శిర్లాం పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ ఇసుక రీచ్ ఉంది. ఇక్కడ నుంచి మక్కువ, పార్వతీపురం తదితరు మండలాలకు ఇసుక రవాణా జరుగుతుంది. చాలావరకు జగనన్న ఇళ్ల పేర్లతో ఒకటి రెండు టోకెన్లు చూపించి ఇసుక మాఫియా అక్రమంగా ఇక్కడి నుంచి ఇసుక తరలించుకుపోతున్నట్టు పలువురు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా ప్రభుత్వ ఇసుక రీచ్ దిగువ భాగంలో పంపు హౌస్‌కు ఎదురుగా ఉన్న పోలమ్మ రేవు నుండి మడతోట రేవు వరకు సువర్ణముఖి నదిలో అక్రమంగా ఇసుక తరలిపోతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. ఆదివారం కూడా ఏ విధమైన అనుమతులేకుండా తెల్లవారు నుండి ఇసుకను ట్రాక్టర్లతో తరలించకపోతున్నా అడ్డుకొనే వారే లేరని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఒడ్డున వేసిన ఇసుకను ట్రాక్టర్‌తో తరలిస్తున్న అక్రమార్కులు

నాటుబళ్లతో ఇసుక డంపు...

మడతోటరేవులోని ఇసుకను నాటుబళ్లతో రహ దారి ప్రాంతానికి డంపు చేస్తూ అక్కడ నుండి ట్రాక్టర్లతో నింపు కొని తరలించుకుపోతున్నారు. నాటుబళ్లయితే ఎవరికీ అను మానం రాదని తెలిసి ఈ విధమైన ఎత్తులు ఇసుక మాఫియా వేస్తుందని పలువురు ఆరోపిస్తున్నారు. ఒక్కో నాటు బండికి రూ.200 డంప్ చేయడానికి ట్రాక్టర్ల యజమానులు చెల్లిస్తు న్నారు. మండలంలోని ఓ వ్యక్తి పలు శాఖల అధికారులతో సమన్వయ చేస్తూ మక్కువ, పార్వతీపురం మండలాల్లో ఇసుక అక్రమ దందాలో ప్రముఖ భూమిక పోషిస్తున్నాడని పలువురు ఆరోపిస్తున్నారు. అలాగే ఆయన చెప్పే ట్రాక్టర్లకే అధిక అనుమతులు ఇస్తూ ఉండడంతో కొంతమంది ట్రాక్టర్ యజమానులు కూడా ఇబ్బందులకు గురవుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా భూగర్భ గనుల శాఖ అధికారులు కూడా కనీసం పట్టించుకోవడం లేదని, ఇతర శాఖల మాదిరిగానే వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి అక్రమ ఇసుక దందాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఇసుకను ఒడ్డుకు చేర్చడానికి వినియోగిస్తున్న నాటు బండి

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రంలో గల రావాడ రోడ్ జంక్షన్ సమీపంలో ఉన్న గుడ్ సమారిటన్ లూథరన్ చర్చిలో పాస్టర్ రెవరెండ్ పి.జీవన్ కుమార్ ఆధ్వర్యంలో ఏసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవల కుటుంబ సభ్యులతో పిల్లలు పెద్దలు అందరూ కలిసి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు దోనక జాన్, దొనక రాజారత్నం, కోట సుందర సుదర్శన్, దొనక ప్రదీప్, దోనక జయ కుమార్, కోట ఈశ్వర రావు, దొనక మజ్జిబాబు, రత్నమ్మ, సుకన్య, సుధా తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని పెదబోగిలి, చినబోగిలి, బూర్జ, మరిపువలస, నిడగల్లు, లచ్చయ్యపేట, అంటిపేట, కాజీపేట, చరిత్ర గ్రామాలలో సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ఫాదర్లు చర్చి పెద్దలతో ఊరేగింపులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్న భోగిలి సర్పంచ్ కురుమల శ్రీనివాసరావు, రాధాతో బాటు ఫాదర్స్ తదితరులు పాల్గొన్నారు.

కురుపాం: క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మహిళలు

పార్వతీపురం టౌన్: జిల్లా కేంద్రంలో ఉన్న పలు చర్చిలలో క్రిస్మస్ వేడుకలను ఆయా సంఘ సభ్యులు ఘనంగా నిర్వహించారు. పండా వీధిలో ఉన్న తిరు కుటుంబ దేవాలయంలో రెవరెండ్ ఫాదర్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వీటితో పాటు బెలగాం లూథరన్ చర్చి, విశాఖ పరిశు ద్ధ లూథరన్ చర్చి బిషప్ బి. సుదర్శన్ రావు, సభ్యులకు ఏసుక్రీస్తు గొప్పతనాన్ని వివరించారు. ఎడిషనల్ రెవరెండ్ పాస్టర్ రామారావు ప్రత్యేక ఆశీర్వాద కార్యక్ర మాన్ని నిర్వహించారు. పరిశుద్ధ ధార్మిక జోజప్పు, తిరు కుటుంబ ఆలయంలో రెవరెండ్ ఫాదర్లు బాలజోజి, జయపాల్ పాల్గొని ప్రత్యేక ప్రార్ధన చేశారు.

గుమ్మలక్ష్మీపురం: జియమ్మ వలస మండలం చినమేరంగిలో క్రిస్మస్ వేడుకల్లో మన్యం జిల్లా వైసిపి అధ్యక్షులు శత్రుచర్ల పరిక్షిత్ రాజు పాల్గొని ప్రార్ధనలు చేశారు. పెద్దబుడ్డిడి, చినబుడ్డిడి, చినకుదమ, జియమ్మవలస గ్రామాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. గుమ్మలక్ష్మీపురం మండలంలో తాడికొండ, ఎల్విన్ పేట, కేదారిపురం, మండ, గుమ్మలక్ష్మీపురం చర్చిల్లో క్రైస్తవ సోదరులు ప్రార్ధనలు నిర్వహించారు. జియమ్మవలస మండలం కుదమ గ్రామంలో నిర్వహించిన వేడుకల్లో టిడిపి అరకు పార్లమెంటరీ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ పాల్గొని క్రైస్తవ సోదరులతో కలిసి ప్రార్ధనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బొంగు సురేష్, మాజీ జెడ్పిటిసి డొంకాడ మంగమ్మ, టిడిపి సీనియర్ నాయకులు మరడాన అప్పలనాయుడు, సర్పంచ్ చేరుకుబిల్లి గిరి, పాస్టర్ తలగాపు రాము ఉన్నారు.

సీతంపేట: లొయోలా సంస్థ ఆధ్వర్యంలో పత్తికగూడలోని ఆర్సీయం చర్చి వద్ద క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. విచారణ గురువులు విద్యాసాగర్, పీటర్‌లు ఆరాధనలు చేశారు.

సీతంపేట : ఊరేగిస్తున్న భక్తులు

సీతంపేట : ఏసుక్రీస్తు వేషధారణలో పిల్లలు

బాలయేసు పుట్టుకను తెలియజేసే నాటికను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మఠకన్యలు ఝాన్సీ, సుదీప్త తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట: అర్చర గ్రామంలో క్రిస్మస్ వేడుక సందర్భంగా పిల్లలకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం: మండల కేంద్రంలోని తెలుగు బాప్టిస్ట్ చర్చ్, ఆర్.సి.యం దేవాలయాలతో పాటు తూడి, చిట్టుపూడి వలస, బిటివాడ, తలవరం, నీలానగరం తదితర గ్రామాల్లో భక్తులు నూతన వస్త్రాలు ధరించి ఉదయం నుండి ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. రెవరెండ్ పాస్టర్ సుకుమార్ పట్నాయక్ మాట్లాడుతూ బాలుడు జన్మించిన ఆయనే లోకానికి రక్షకుడని వివరించారు.

భామిని: స్థానిక చర్చిలో ఫాదర్ థామస్ రెడ్డి ఆధ్వర్యంలో క్రైస్తవులు ప్రేత్యేక ప్రార్ధన నిర్వహించి, క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బైబిల్, ఏసు పుట్టుక సారాంశం ను తెలిపారు. ఈ కార్యక్రమంలో కానోసా సిస్టర్, సర్పంచ్ లోపింటి రాజేష్, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

వినూత్న రీతిలో నిరసన

ప్రజాశక్తి - కొమరాడ

మరమ్మతుకు గురైన రోడ్లను బాగుచేసి ప్రమాదాలను నివారించాలని అంతర్ రాష్ట్ర రహదారిపై సోమవారం వినూతన రీతిలో సిపిఎం నాయకులు నిరసన తెలిపారు. ఆడుదాం ఆంధ్ర ప్రభుత్వ కార్యక్రమాన్ని ఎద్దేవా చేస్తూ సునాలయం వద్ద అంతర్ రాష్ట్ర రహదారి మార్గంలో ఉన్న గోతుల వద్ద వాలీబాల్, క్రికెట్, కబడ్డీ ఆడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, టిడిపి నాయకులు బత్తిలి శ్రీనివాసరావు, జనసేన నాయకులు మరడాన రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కనీసం రోడ్లు మరమ్మత్తులు చేసేందుకు నిధులు కూడా లేవని చేతులెత్తేయడం సిగ్గుచేటన్నారు. పార్వతీపురం నుంచి కోనేరు వరకు వెళ్లే అంతరాష్ట్ర రహదారిపై పలు ప్రాంతాల్లో భారీ గోతులు ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. రోడ్డు వేయకపోయినా కనీసం గోతులునైనా కప్పివేసి ప్రమాదాలు నివారించే విధంగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

రహదారిపై వాలీబాల్ ఆడి నిరసన తెలుపుతున్న నాయకులు

అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజన విద్యార్థులు అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధించి తమ సత్తా చూపించాలని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం. కిరణ్ కుమార్ హితవు పలికారు. భద్రగిరి పిటిజి బాలికల ఉన్నత పాఠశాల సోమవారం మోటివేషనల్ స్పీచ్ ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ యుగంధర్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో కిరణ్ కుమార్ ప్రసంగిస్తూ తాను వసతి గృహాల్లో ఉండి కష్టపడి చదువుకొని ఈ స్థాయికి వచ్చినట్లు వివరించారు. గిరిజన విద్యార్థులు ఒక నిర్దిష్టమైన లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని తాను అనుకున్న రంగంలో అభివృద్ధిని సాధించేందుకు చిత్త శుద్ధితో కృషి చేయాలని కోరారు. సర్పంచ్ బి గౌరీ శంకర్రావు మాట్లాడుతూ ఎటువంటి సౌకర్యాలు లేని టైమ్‌లో కిరణ్ కుమార్ స్వయం కృషితో ఈ స్థాయికి వచ్చారని గిరిజన విద్యార్థుల్లో మంచి ప్రతిభ పాటవాలు ఉన్నాయని వాటిని సక్రమంగా వినియోగించుకొని అభివృద్ధిని సాధించాలని కోరారు. పదో తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి సత్తా చాటాలని వక్తలు ఆకాంక్షించారు. సమావేశంలో విశ్రాంత ఉపాధ్యాయులు హరిప్రసాద్, అసిస్టెంట్ ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మెప్మా పీడీ కిరణ్‌కుమార్

నెల్లిమర్లలో 'బైరెడ్డి' వర్ధంతి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ స్వర్గీయ బైరెడ్డి సూర్యనారాయణ వర్ధంతిని సోమవారం స్థానిక బైరెడ్డి సూర్యనారాయణ కళ్యాణ మండపంలో ఆయన కుమారుడు మాజీ సర్పంచ్ బైరెడ్డి నాగేశ్వర రావు, లీలావతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ స్వర్గీయ బైరెడ్డి సూర్యనారాయణ నిరాడంబర జీవితాన్ని గడిపి సర్పంచ్ స్థాయి నుంచి జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఎదిగారని కొనియాడారు. గ్రామాన్ని, జిల్లాను అభివృద్ధి బాటలో నడిపించి ఎవరికి ఏ కష్టం, అవసరం వచ్చినా వెంటనే స్పందించి సహయ సహకారాలు అందంచేవారని చెప్పారు. టిడిపిని నెల్లిమర్లతో బాటు గ్రామాల్లో విస్తరించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. అటువంటి వ్యక్తిని తప్పనిసరిగా యువత ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. ఆయన అధికారంలో ఉన్నపుడు జిల్లా వ్యాప్తంగా అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు లెంక అప్పలనాయుడు, మహంతి శ్రీని వాసరావు, కాళ్ళ రాజ శేఖర్, బైరెడ్డి సూర్యనారాయణ, చందక పెంటంనాయుడు, రెడ్డి వేణు, కలిశెట్టి కన్నంనాయుడు, శివరాం మాస్టర్, చందకు శంకర్రావు, బోలె కృష్ణమూర్తి, బైరెడ్డి సత్యనారాయణ, నడిపేన నారాయణరావు, బైరెడ్డి సతీష్, విసినిగిరి అప్పారావు, బైరెడ్డి రమణ తదితరులు పాల్గొన్నారు.

రెండు ఆటోలు ఢీ

- తెగి పడిన మహిళ చేయి
- ఆరుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని బూరాడ గ్రామ సమీపంలో సోమవారం ఎదురెదురుగా వస్తున్న రెండు ఆటోలు ఢీకొన్న ఘటనలో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఒక మహిళా చేయి తెగి రోడ్డుపై పడటంతో చూపురులు సైతం ఆందోళనకు గురయ్యారు. వీరిలో ముగ్గురు పరిస్థితి విషమంగా ఉంది. వివరాల్లోకి వెళితే.. పాలకొండ నుంచి రాజాం వెళ్తున్న ఆటో, రాజాం నుంచి అంబాడ వెంకటాపురం వైపు ఎదురుగా వస్తున్న మరో ఆటో బూరాడ వద్ద ఢీకొన్నాయి. ఈ సంఘటనలో అంబాడ వెంకటాపురం గ్రామానికి చెందిన వావిలపల్లి కళ్యాణికి కుడి చేయి తెగిపడింది. కుడికాలు నుజ్జు నుజ్జు అయ్యాయి. అదే గ్రామానికి చెందిన పనస దుర్గమ్మ తలకు తీవ్ర గాయమైంది. తాతపూడి సూరమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. చాటాయివలస గ్రామానికి చెందిన గోదారి రాములకు రెండు కాళ్లు నుజ్జు నుజ్జు అయ్యాయి. లక్ష్మంపురం గ్రామానికి చెందిన కెంబూరి బంగారమ్మకు కుడి కాలికి తీవ్ర గాయాలయ్యాయి. మిగిలిన నలుగురికి స్వల్ప గాయాలు అయ్యాయి. క్షతగాత్రులకు 108 సిబ్బంది ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కొంతమందిని రాజాం కేర్ ఆసుపత్రికి, ఇంకొంతమందిని ఏరియా ఆసుపత్రికి తరలించారు. కళ్యాణి, దుర్గమ్మ, రాములు పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఏరియా ఆసుపత్రి వైద్యులు సమాచారం మేరకు రేగిడి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

చేయిని కోల్పోయిన కల్యాణి

తెగిపడిన చేయి

అందరి చూపు బొబ్బిలి వైపు

- వైసిపి అభ్యర్థి మార్పు అనివార్యం?
- కొత్త ముఖం ఎవరో?
- అన్వేషణలో అధికార పార్టీ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఎన్నికలు దగ్గర పడుతుండడం, మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో జిల్లాలో అందరి చూపు బొబ్బిలి రాజకీయాల వైపు తిరుగుతున్నాయి. ఇంతకీ వైసిపి తరపు ఎమ్మెల్యే అభ్యర్థి ఎవరు? స్థానిక ఎమ్మెల్యే మార్పు అనివార్యమేనా? అలా అయితే కొత్త ముఖం ఎవరు? ఇదీ ప్రస్తుతం జిల్లా వాప్తంగా సాగుతున్న చర్చ. వైసిపిలో చాలా వరకు స్థానిక ఎమ్మెల్యేలను మార్చాలని, వారి సేవలు పార్టీలో అనివార్యమనుకుంటే మరో అసెంబ్లీ స్థానానికి బదిలీ చేయడం వంటి చర్యలు ముమ్మరం చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లాలో బొబ్బిలి, రాజాం సిట్టింగ్ ఎమ్మెల్యేలను తప్పిస్తారని, మరో ఇద్దరు ఎమ్మెల్యేలను బదిలీ చేస్తారనే చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో బొబ్బిలిలో వైసిపి తరపున ఎవరు పోటీచేస్తారో? అన్న చర్చ గట్టిగా సాగుతోంది. ఇందుకు కారణం లేకపోలేదు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లా అంతటా వైసిపి గాలికి టిడిపి కొట్టుకుపోయినప్పటికీ బొబ్బిలి నియోజకవర్గంలో మాత్రం గట్టిపోటీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆ తరువాత కూడా టిడిపి బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన కేడర్‌ను అంటిపెట్టుకుని ముందుకు సాగుతున్నారు. మరోవైపు పార్టీని నడపడంలోనూ, ఎమ్మెల్యేగా ప్రజా సమస్యలపై స్పందించడంలోనూ స్థానిక ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు విఫలమయ్యారు. దీనికితోడు బొబ్బిలిలో ఒక్కగానొక్క జ్యూట్ మిల్లును తెరిపిస్తానన్న ఆయన చివరకు దాన్ని రియల్ ఎస్టేట్‌కు విక్రయించేందుకు సహాయపడ్డారు. స్థానిక గ్రోత్ సెంటర్‌కు గ్రోత్ లేకుండా పోయింది. అటు టిడిపిలో బలమైన అభ్యర్థిని రంగంలోకి దింపే అవకాశం ఉండడం, ఇటు ప్రజల్లో వ్యతిరేకత కనిపిస్తుండడంతో శంబంగిని మారుస్తారని చర్చ నడుస్తోంది. ఒకవేళ ఆయన్ను మారిస్తే ఆ స్థానంలో ఎవరు వస్తారనే చర్చ కూడా సాగుతోంది. జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వచ్చే ఎన్నికల్లో బొబ్బిలి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు ప్రయత్నాలు చేసుకుంటున్నట్టు ప్రచారం నడుస్తోంది. మంత్రి బొత్స, సోదరులను వారి స్థానాల నుంచి తప్పించే పరిస్థితి లేదు. నెల్లిమర్లలో ఆయన సమీప బంధువు సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్నారు.

రాజాంలో రిజర్వేషన్ అనుకూలించే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో మజ్జి శ్రీనివాసరావు బొబ్బిలిలో పోటీ చేస్తారని చర్చ నడుస్తున్నప్పటికీ టిడిపి అభ్యర్థిని ఎదుర్కోవాలంటే ఆ నియోజకవర్గంలోని మెజార్టీ సామాజికవర్గం నుంచే ఉండాలని వైసిపి అధిష్టానం భావిస్తున్నట్టు తెలుస్తోంది. లేదంటే ఆ సామాజికవర్గం ప్రభావం జిల్లా అంతటా చూపించే ప్రమాదం లేకపోలేదని పలువురు రాజకీయ నాయకులు విశ్లేషిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొంతమంది వైద్యులను పార్టీలోకి ఆహ్వానిస్తున్నారని, వారు అంతగా ఆసక్తి చూపడం లేదని కూడా చర్చ నడుస్తోంది. ఈ అవకాశం ఎవరికి దక్కుతుందో కొద్దిరోజులు వేచిచూడాల్సిందేనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.